

ఘనంగా వసంతసేవ
మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో ఆదివారం ఘనంగా వసంతసేవ నిర్వహించారు.
- 8లో



ముగిసిన బ్రహ్మోత్సవాలు
పేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం చక్రస్నానంతో ముగిశాయి.
- 8లో

గరిష్టం/కనిష్టం
38° / 27°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతులు ఇబ్బంది పడకుండా చూడాలి



మునగాల: నేలమర్రిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

కోదాడ రూరల్, మునగాల: రైతులు ఇబ్బంది పడకుండా మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణ పరిధిలోని తమ్మరలో గల వసుంధర రైస్‌మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం మునగాల మండలం నేలమర్రిలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన, తేమ శాతం ఎక్కువ ఉన్న ధాన్యాన్ని కూడా దిగుమతి చేసుకోవాల్సిందేనని మిల్లర్లను ఆదేశించారు. కాంటా వేసిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు రవాణా చేయాలని, ధాన్యం దిగుమతిలో ఆలస్యం చేయవద్దన్నారు. అసవరమైతే హమాలీల సంఖ్య పెంచుకోవాలని, అదనపు గోదాములను చూసుకోవాలన్నారు. నాణ్యత పేరుతో తరుగుతీస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అకాల వర్షాలకు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వమే కొంటుందని, రైతులు అధైర్యపడొద్దని పేర్కొన్నారు. ఆయన వెంట కోదాడ మండల స్పెషల్ ఆఫీసర్, నడిగూడెం తహసీల్దార్ నాగేశ్వరరావు, స్థానిక తహసీల్దార్ శ్రీనివాసశర్మ, మునగాల ఇన్‌చార్జి తహసీల్దార్ జవహర్, ఏఓ అనిల్‌కుమార్, కోదాడ డీటీసీఎస్ రాంరెడ్డి, ఆర్‌ఐలు పోతుగంటి ప్రసాద్, వెంకటనగేష్, కల్యాణి, మిల్లు యాజమాన్యం ఉన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి పాటుపడాలి



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న నాయకులు

భానుపురి(సూర్యాపేట): రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌ల సంక్షేమానికి పాటుపడాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఈదుల యాదగిరి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 8వ వార్డులో ముదిరాజ్ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముదిరాజులు ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 8వ వార్డు ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా పోలబోయిన సైదులు, ప్రధాన కార్యదర్శిగా సారగండ్ల కోటేష్, గౌరవ సలహాదారులుగా ఇండ్ల శేఖర్, నాగరాజు, పిట్టల రోశయ్య, మరిపెద్ది లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా నీరుడు రమేష్, నిమ్మరబోయిన శీను, గుండు మల్సూరు, కంటూ సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వాకిటి సతీష్, సహాయ కార్యదర్శిగా ఏర్పుల ఉపేందర్, అంకిరెడ్డి నాగరాజు, శ్రీను, పాండవుల భిక్షపతి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గుంటి శ్రీను, మామిడి రాములు, మద్దెబోయిన రవిశంకర్, వనం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే రాజ్యాధికారం

భానుపురి(సూర్యాపేట): బహుజనులకు రాజ్యాధికారం బీఎస్పీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుడిగె మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని రైతుబజార్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీల అభివృద్ధి జరగడం లేదన్నారు. సీఎం కేసీఆర్ నియంత పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. పేపర్ లీకేజీ కారకులను కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు తరలి వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో గోపి, స్టాలిన్, దాసరి శీను, పిడమర్తి దశరథ, చెరుకు లక్ష్మణ్, వెంకన్న పాల్గొన్నారు.

నేడు 'కూరెళ్ల'కు గురు సత్కారం

రామన్నపేట: మధురకవి, దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు సోమవారం హైదరాబాద్‌లోని ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో గురు సత్కారం జరగనుంది. మారుమూల గ్రామంలో మహా గ్రంథాలయం ఏర్పాటు చేసి ఊరూరా గ్రంథాలయాలు ఏర్పాటు చేయడానికి స్ఫూర్తిగా నిలిచినందుకు గాను విఠలాచార్యను పంచార్షేయ వైదిక పరిషత్తు ఆధ్వర్యంలో సత్కరించనున్నారు. పల్లకిసేవ, పుష్పాభిషేకం, విశ్వాక్షరబ్రహ్మ బిరుదు ప్రదానం, పాదపూజ, జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నారు.

కరెంట్ పోతే కష్టాలే..!

కోదాడ డయాలసిస్ సెంటర్‌లో కనీస సౌకర్యాలు కరువు

- తక్కువ కెపాసిటీతో ట్రాన్స్‌ఫార్మర్.. రిపేరులో జనరేటర్
- సరిపడా సరఫరాకాని నీరు
- పట్టించుకోని యంత్రాంగం
- ఇబ్బందులు పడుతున్న రోగులు



కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్

కోదాడ: కిడ్నీలు పాడైపోయిన రోగుల సౌకర్యార్థం కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌లో మౌలిక వసతులు కరువయ్యాయి. నిరంతర కరెంట్ సరఫరాతోపాటు నీటి వసతి సరిపడా లేకపోవడంతో సకాలంలో వైద్య సేవలందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధి కారులు చూద్దాం.. చేద్దాం ..అంటూ కాలం గడుపుతుండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం ఇబ్బందులే..

ఈ వైద్యశాలలో ఉన్న పురుషుల వార్డులో మార్చి నెలలో ఐదు పడకలతో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. దీన్ని ఔట్‌సోర్సింగ్ కంపెనీ ద్వారా ఏర్పాటు చేసినప్పటికీ దానికి కావాల్సిన విద్యుత్, నీరు ప్రభుత్వ వైద్యశాల వారే సమకూర్చాల్సి ఉంటుంది. కోదాడ వైద్యశాల సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ తక్కువగా ఉండడంతో డయాలసిస్ సెంటర్‌లో ఐదు మిషన్లు ఆన్ చేయగానే ట్రిప్పు అవుతుంది. దీంతో డయాలసిస్ మధ్యలో ఆగిపోవడంతో రోగులు నరకం చూస్తున్నారు. వైద్యశాలలో జనరేటర్ రిపేర్‌లో ఉన్నప్పటికీ దాన్ని బాగు చేయించడం లేదు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం గాని, ఉన్నదాని కెపాసిటీ పెంచాలని కోరుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

నలుగురి పని.. ఇద్దరితోనే..

ఐదు పడకల డయాలసిస్ సెంటర్‌లో నలుగురు టెక్నీషియన్లు, ఒక ఇన్‌చార్జి ఉండాలి. కానీ, కోదాడ డయాలసిస్ సెంటర్‌లో కేవలం ఒక టెక్నీషియన్, ఒక ఇన్‌చార్జితోనే పని కానిచ్చేస్తున్నారు. ఒక పేషంట్‌కు డయాలసిస్ నాలుగు గంటలు చేయాల్సి ఉంటుంది. కానీ, టెక్నీషియన్లు ఇద్దరే ఉండడంతో వారి డ్యూటీ సమయంలోనే రోగులందరికీ డయాలసిస్ చేయాల్సి వస్తోంది. నాలుగు గంటలు చేయాల్సిన డయాలసిస్‌ను రెండున్నర గంటల నుంచి 3 గంటలలోపే పూర్తి చేసి పంపిస్తున్నారు. డయాలసిస్ సెంటర్ ప్రారంభించి రెండు నెలలు పూర్తి కావస్తున్నా నేటికీ పూర్తిస్థాయి సిబ్బందిని నియమించడంతోపాటు, సౌకర్యాలను కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.

ఇంతకంటే నరకం ఉండదు

నేను డయాలసిస్ పేషంట్‌ను. గత నెలలో కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు వెళితే డయాలసిస్ ప్రారంభించిన గంటకు కరెంట్ పోయింది. ఆ గదిలో కనీసం లైట్లు, ఫ్యాన్లు కూడా లేవు. మూడు గంటల తరువాత కరెంట్ వచ్చింది. అప్పటి వరకు ఆ గదిలోనే ఉక్కపోతను భరిస్తూ బెడ్‌పైన పడుకొని ఉన్నాను. ఇంతకంటే నరకం ఏముంటుంది. ఇది నా ఒక్కరి సమస్యే కాదు. కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్‌కు వస్తున్న ప్రతి ఒక్కరిదీ.

– ఉపేందర్, డయాలసిస్ పేషంట్, కోదాడ

నీటి సరఫరా అంతంతే..!

డయాలసిస్ సెంటర్‌లో ఉన్న ఐదు మిషన్లు నాలుగు షిఫ్టుల్లో పని చేయాల్సి ఉంటుంది. దీంతో రోజుకు 20 మంది రోగులకు డయాలసిస్ చేయొచ్చు. ఒకరికి డయాలసిస్ చేయాలంటే 120 లీటర్ల నీరు అవసరం. దీనికి సరపడా నీరు కూడా ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని రోగులు అంటున్నారు. మున్సిపాలిటీ నుంచి నీటి సరఫరా కోసం లైన్ వేసినప్పటికి నీరు సరిపడా రావడం లేదని సమాచారం. ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని రోగులు వాపోతున్నారు.



- నాలుగు సెంటర్లలో నీట్



వైద్య విద్యలో అడ్మిషన్ల కోసం ఆదివారం జిల్లాలో నాలుగు సెంటర్లలో జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) జరిగింది. దీంట్లో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో అంజలి స్కూల్‌లో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

- కలెక్టర్ వెంకట్రావు



దురాజ్‌పల్లిలో బస్తాలను పరిశీలిస్తున్న కలెక్టర్

సూర్యాపేట రూరల్, చివ్వెంల: ధాన్యం కొనుగోలు అనంతరం వెంటనే ఐకేపీ కేంద్రాలను నుంచి మిల్లులను తరలించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. ఆదివారం సూర్యాపేట పట్టణ పరిధిలోని శాంతినగర్‌లో గల నవరత్న పార్‌బాయిల్డ్ మిల్లుతోపాటు మండలంలోని రామకోటితండా, చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులో జరుగుతున్న ధాన్యం దిగుమతిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు అధి కారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నా రు. మిల్లుల్లో ధాన్యం దిగుమతి వేగంగా జరిగేలా హమాలీల సంఖ్య పెంచాలని అధికారులకు సూచించారు. ఆయనవెంట అధికారులు ఉన్నారు.

వాటర్‌ఫాల్స్ ట్రయల్ రన్



మొదటి ఘాట్‌రోడ్డులో వాటర్ ఫాల్స్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆహ్లాదం పంచేందుకు మొదటి ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేసిన వాటర్ ఫాల్స్‌ను అధికారులు ఆదివారం ట్రయల్‌రన్ నిర్వహించారు. త్వరలోనే ఘాట్‌రోడ్డు నుంచి వాహనాలను అనుమతించనున్న నేపథ్యంలో జలపాతాన్ని అధికారులు ట్రయల్ రన్ చేసి పరిశీలించారు.

ఇందిరమ్మ కాలనీలో ఏం జరుగుతోంది!

- 'పేట'లో పేదలకు ఇచ్చిన ప్లాట్లను ఆక్రమించి అమ్ముతున్న దళారులు
- హక్కుదారులకు తెలియకుండానే తతంగం
- యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్న కొనుగోలుదారులు
- విషయం తెలుసుకొని వెళ్లి అడ్డుకుంటున్న హక్కుదారులు
- అధికారుల అండతోనే దందా సాగుతోందని ఆరోపణలు



మూడవ విడత ఇందిరమ్మ కాలనీ నిర్మాణాలు

సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలోని మూడు విడతల్లో పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. కాలనీలో ఖాళీ ప్లాటు కనిపిస్తే చాలు కొందరు దళారులు యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. అంతటితో ఆగక ఆయా ప్లాట్లను చదును చేసి గృహనిర్మాణ శాఖ అధికారులతో కుమ్మక్కై, నకిలీ పట్టాలు సృష్టించి లబ్ధిదారులను బెదిరింపులకు గురిచేస్తూ ఎంచక్కా వేరే వారికి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారం.. గృహ నిర్మాణ శాఖ అధికారుల అండదండలతో జరుగుతోందని ఇక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు.

వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో పంపిణీ..

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 2009లో పేద, మధ్య తరగతి వారికి గూడు కల్పించాలన్న ఉద్దేశంతో సూర్యాపేట శివారులోని కుసుమవారిగూడెం సమీపంలో ఇందిరమ్మ కాలనీ మొదటి, రెండవ, మూడవ విడతల్లో ఒక్కొక్కరికీ 90 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. అందులో చాలామంది పేదలు ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నారు. కొందరు కట్టుకునే స్థోమత లేక ఖాళీ ప్లాట్లను అలాగే ఉంచుకున్నారు.

దళారుల రంగప్రవేశం ఇలా..

మొదటి విడత కాలనీ సరిపోక ఆ తర్వాత రెండు, మూడు విడతల కాలనీ ఏర్పాటు చేసింది. లబ్ధిదారులకు వందలాది ప్లాట్లను పంపిణీ చేశారు. కొన్నాళ్ల తర్వాత సూర్యాపేట .. జిల్లా కేంద్రం అయింది. దీంతో ఈ ప్లాట్లపై దళారుల కన్నుపడింది. ప్లాట్ల హక్కుదారులు ఇటువైపు రాకపోవడాన్ని గమనించి వాటిని వేరే వారికి అమ్మాలని పన్నాగం పన్నారు. ఈ నేపథ్యంలో ఒక్కో ప్లాట్ కేవల రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకే లభిస్తుందని తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రంలో తమకు ఒక గూడు ఉంటుందని భావించి వాటి కొనుగోళ్లకు ముందుకొచ్చారు. మొదట ఎవరి పేరు మీదైతే ప్లాట్ జారీ కాబడిందో చివరి వరకూ వారి పేరు మీదనే కొనసాగుతుందని గృహనిర్మాణ శాఖ అధికారులు పేర్కొన్నప్పటికీ కొందరు దళారులు మాత్రం కొనుగోలుదారులకు మాయమాటలు చెబుతూ ఈ ప్లాట్లను ఎవరు కొంటే వారి పేరు మీదే పట్టా చేపిస్తామంటూ నమ్మబలికి ఇతరులకు అప్పనంగా అమ్ముతూ లక్షల రూపాయలు మూటగట్టుకుంటున్నారు. ఇదేమి తెలియని ప్లాట్ హక్కుదారులు తమ ప్లాట్లు సురక్షితంగానే ఉన్నాయనే ధీమాతో ఉంటున్నారు. తీరా దళారుల ద్వారా కొనుగోలు చేసిన వ్యక్తులు ఇల్లు కట్టుకుంటుండగా అసలు హక్కుదారులు వచ్చి ప్లాట్లలో నిర్మాణాలు చేపడుతున్న వారితో గొడవలకు దిగుతున్నారు.

దాడి ఘటనతో వెలుగులోకి..

తన ప్లాట్‌ను ఆక్రమించి ఇల్లు నిర్మించుకుంటున్నారని తాజాగా శనివారం హక్కుదారురాలు ఒకరు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో సూర్యాపేట మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది భిక్షం క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లగా అతనిపై ఇల్లు నిర్మించుకుంటున్న నవిలే భద్రయ్య అనే వ్యక్తి గొడ్డలితో దాడి చేశారు. ఈ ఘటనను అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఇలా చాలామంది దళారుల ద్వారా ఈ కాలనీలో ప్లాట్లు కొనుగోలు చేసి నిర్మాణాలు జరుపుతున్నట్టు సమాచారం.

దళారులపై చర్యలు తప్పవు



"పేదలకు ఇచ్చిన భూములను దళారులు ఆక్రమించి అనంతరం వాటిని మాయమాటలు చెప్పి ఇతరుకు అమ్మితే చేస్తే చర్యలు తీసుకుటాం. మున్సిపల్ సిబందిపై దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నాం. ముమ్ముందు ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకముందే అధికారులు వెంటనే ఇందిరమ్మ కాలనీలో ప్లాట్లు అమ్ముత్ను దళారులను గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.

– ఎస్.వెంకట్రావు, కలెక్టర్, సూర్యాపేట

ఉచితంగా నోట్‌బుక్స్

- ప్రభుత్వ విద్యార్థులకు అందించాలని సర్కారు నిర్ణయం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- స్కూళ్లు పునఃప్రారంభమైన రోజు నుంచే పంపిణీకి ప్రణాళిక
- 90వేల మందికి ప్రయోజనం



సూర్యాపేట టౌన్: సర్కారు స్కూళ్లలో చదివే విద్యార్థులకు వచ్చే విద్యాసంవత్సరం (2023–24) నుంచి ఉచితంగా నోట్‌బుక్స్ అందజేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే ఒక్కో విద్యార్థికి ఏడాదికి రెండు జతల యూనిఫాం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తోంది. ఈ ఏడాది జూన్ మొదటి వారంలో చేపట్టే బడిబాటలోనే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంతోపాటు నోట్ బుక్స్ అందజేయాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది.

పేద విద్యార్థులు ఇబ్బందులు పడొద్దని..

ప్రభుత్వ విద్యార్థులకు ఇప్పటి వరకు సర్కారు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ఉచితంగా ఇచ్చేది. విద్యార్థులు నోట్‌బుక్స్ కొనాలంటే వేలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు పడొద్దనేఉద్దేశంతో ఉచితంగా నోట్‌బుక్స్ అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

1నుంచి5 తరగతుల వారికి వర్క్‌బుక్స్ కూడా..

ప్రాథమిక పాఠశాలల్లోని 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు వర్క్‌బుక్స్, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నోట్ బుక్స్ ఉచితంగా పంపిణీ చేయనున్నారు. వర్క్‌బుక్స్, నోట్ బుక్స్‌తో పాటు ద్విభాషా(తెలుగు, ఇంగ్లిష్) పుస్తకాలను పాఠశాల పునఃప్రారంభమైన వెంటనే అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమక్షంలోనే విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేసేలా కార్యక్రమాలు రూపొందించాలని విద్యాశాఖ మంత్రి.. ఆదేశించారు.

989 పాఠశాలల విద్యార్థులకు మేలు

950 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో నోట్‌బుక్స్, వర్క్ బుక్స్ ఇవ్వనున్నారు. 18 కేజీబీవీలు, తొమ్మిది మోడల్ స్కూల్స్, నాలుగు మైనార్టీ, నాలుగు బీసీ, నాలుగు సాంఘిక సంక్షేమ గురుకులాలతో కలిసి మొత్తం 39 స్కూళ్లలో ఇప్పటికే నోట్‌బుక్స్ పంపిణీ చేస్తుండగా కొత్తగా వర్క్ బుక్స్ ఇస్తారు. దీంతో 989 స్కూళ్లో 90వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

జూన్ మొదటి వారంలో బడిబాట

పాఠశాలలు జూన్ 12వ తేదీ నుంచి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అదేనెల మొదటి వారంలో బడిబాట కార్యక్రమం ఉంటుంది. బడిబాట ద్వారా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి విద్యార్థులతో ర్యాలీలు చేపట్టి ప్రభుత్వ పాఠశాలల్లో అందున్న నాణ్యమైన విద్య, ఇతర సౌకర్యాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తారు. బడిబాటలో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని విద్యాశాఖ మంత్రి ఆదేశించారు.

'అల్లూరి'ని ఆదర్శంగా తీసుకోవాలి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు(ఎస్): స్వాతంత్య్రోద్యమంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆంగ్లేయులను ఎదిరించిన అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆయుధంతోనే దేశానికి స్వాతంత్య్రం వస్తుందని నమ్మి ఆంగ్లేయులకు తలొగ్గకుండా పోరాడిన ధీరుడు అల్లూరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పోతురాజు ధనమ్మ, ఆ సంఘం నాయకులు కృష్ణ, ప్రతాప్, లింగయ్య, పద్మ, శీను, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తూచ్..!

కోదాడలో మళ్లీ మొదలైన మట్టి దందా

- వ్యాపారులు, ఓ నేత మధ్య కుదిరిన ఒప్పందం!
- మూణ్నెళ్లుగా దొరకని మట్టి.. ఇప్పుడు అందుబాటులోకి
- గతంలో కంటే రెట్టింపు ధరలకు విక్రయం
- ఆందోళనలో గృహనిర్మాణదారులు



కోదాడ: కోదాడ పట్టణంలో మట్టి దందా మళ్లీ జోరందుకుంది. పోలీస్ అధికారులు నిన్నటి వరకు నిబంధనలు అన్నారు.. ఇప్పుడు తూచ్ అంటున్నారు. దీంతో గృహ నిర్మాణదారులకు మూడు నెలలుగా దొరకని మట్టి రెండు వారాల నుంచి కావాలిసిన వారికి కావాల్సినంత లభిస్తోంది. అధికారులు, నేతలకు ముడుపులు సమర్పించుకొని వ్యాపారులు మళ్లీ మట్టి దందాను సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలో మట్టి ట్రాక్టర్ కనపడితే కేసులు పెట్టారు..

కొంతకాలంగా మట్టి వ్యాపారులు ప్రభుత్వ భూములు, చెరువుల నుంచి మట్టిని తెచ్చి కోదాడ పట్టణంలో అమ్మేవారు. తమ వ్యాపారం సజావుగా కొనసాగించేందుకు అందరినీ సంతృప్తి పరిచేవారు. దీంతో వీరి అక్రమ వ్యాపారం మూడు ట్రాక్టర్లు.. ఆరు ట్రిప్పుల చందంగా నడిచింది. ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు జోక్యం చేసుకొని పోలీసుల చేత కేసులు పెట్టించారని.. దీంతో మట్టి వ్యాపారులు కొంతమందికి ముట్టజెప్పారని..ట్రాక్టర్లకు టోకెన్ సిస్టమ్ పెట్టారని ఆరోపణలు రావడంతో మట్టి వ్యాపారాన్ని పూర్తిగా ఆపి వేయించారు. పోలీసులు కూడా కోదాడ నియోజకర్గంలో మట్టి ట్రాక్టర్ కనపడితే వెంటనే కేసులు పెట్టి నానా హడావుడి చేశారు. సొంత భూమి నుంచి మట్టిని తెచ్చుకున్నా మైనింగ్ పర్మిషన్ తెచ్చుకోవాలని హుకుం జారీ చేశారు. ఇళ్లు కట్టుకొనే వారు మూడు నెలలుగా మట్టి లేక నానా ఇబ్బందులు పడ్డారు. అధికారుల వద్దకు, నేతల వద్దకు కాళ్లు అరిగేలా తిరిగినా ససేమిరా అన్నారు. ప్రభుత్వ భూముల నుంచి మట్టిని అక్రమంగా తెచ్చుకొనే వారు ట్రాక్టర్ మట్టి రూ.700లకు మించి అమ్మవద్దని చెప్పారు. ఇప్పుడు అదే మట్టికి గతంలో కంటే రెట్టింపు ధరను వసూలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా గృహ, భవన నిర్మాణదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

రూ.వెయ్యికి తోలుతామని చెప్పి..

మట్టి దందాపై అధికారులు, ప్రజాప్రతినిధులు కన్నెర్ర జేయడంతో దిగివచ్చిన వ్యాపారులు నెల రోజుల క్రితం కోదాడ పబ్లిక్ క్లబ్‌లో విలేకరుల సమావేశం పెట్టి ట్రాక్టర్ మట్టిని రూ.వెయ్యికి, ట్రిప్పర్ మట్టిని రూ.4,300లకు తోలుతామని ప్రకటించారు. ఐనప్పటికి అధికారులు ససేమిరా అన్నారు. దీంతో రంగంలోకి దిగిన కాపుగల్లుకు చెందిన ఓ నేత మట్టి వ్యాపారులుతో ఒప్పదం కుదుర్చుకున్నారని నెలవారీగా కొంత ముట్టజెప్పడంతో పాటు ట్రాక్టర్లకు గతంలో మాదిరిగానే రూ.150 చెల్లిస్తే మట్టి తోలకంలో ఎలాంటి ఆటంకాలు ఉండవని చెప్పడంతో మట్టి దందాకు లైన్‌క్లియర్ అయినట్లు సమాచారం. అయితే ట్రాక్టర్ మట్టిని రూ. వెయ్యికి తోలుతామని రూ.1,300 లకు పెంచారు. అలాగే రూ.4,300లకే ట్రిప్పర్ మట్టిని తోలుతామన్న వారు ఇప్పుడు రూ.5,300 వసూలు చేస్తున్నారు. ఇదే మిటని ప్రశ్నిస్తే మీకు కావాలా.. వద్దా అన్నట్టుగా మాట్లాడుతున్నారని పలువురు వాపోతున్నారు.

అటకెక్కిన పోలీస్ రూల్స్..

చట్టం ముందు అందరూ సమానమే.. నిబంధనలు అందరూ పాటించాల్సిందేనని చెపుతున్న పోలీసుల తీరు కోదాడ నియోజకవర్గంలో సామాన్యులకు నవ్వు తెప్పిస్తుంది. మట్టి వ్యాపారంతో పోలీసులకు ఎలాంటి సంబంధం లేక పోయినా ఈ విషయంలో వారు ప్రవర్తిస్తున్న తీరు వారిని నవ్వులపాలు చేస్తుందని పలువురు అంటున్నారు. గడిచిన మూడు నెలలుగా మట్టి ట్రాక్టర్, ట్రిప్పర్ కనపడితే వెంటనే కేసులు నమోదు చేశారు. అంతేకాదు ఒక్క ట్రాక్టర్‌ను కూడా రోడ్డుమీద తిరగనీయలేదు. మూడు నెలలుగా చెప్పిన రూల్స్ ఇప్పుడు మాత్రం అటకెక్కాయి. రెండు వారాలుగా అదే పోలీస్‌స్టేషన్ ముందు నుంచి పదుల సంఖ్యలో మట్టి ట్రాక్టర్లు తిరుగుతున్నా పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా

భూతవైద్యుడిపై కేసు



ఎస్‌ఓటీ పోలీసులు కేసు నమోదు చేసిన అనిల్

మోటకొండూర్ : భూత వైద్యం పేరుతో ప్రజలను మోసగిస్తున్న వ్యక్తిపై మోటకొండూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన సుధగాని అనిల్ భూతవైద్యం పేరులో ప్రజల వద్ద డబ్బులు దండుకుంటున్నాడని ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు వైద్యం కావాలని ఆదివారం వెళ్లి అనిల్ వద్ద ఉన్న డబ్బులు, సెల్‌ఫోన్‌లు, తాయత్తులు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళకు తీవ్ర గాయాలు

- కోతులను వెళ్లగొట్టే క్రమంలో ప్రమాదం

శాలిగౌరారం: విద్యుదాఘాతంతో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ గుజిలాల్ రమణ సాయంత్రం ఇంట్లో పనులు చేసుకుంటోంది. ఈ సమయంలో కోతులు ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నించాయి. వాటిని వెళ్లగొట్టేందుకు ఇంటిపైకి వెళ్లింది. అక్కడ ఉన్న స్టీల్ పైపుతో కోతులను వెళ్లగొడుతోంది. ఇదే సమయంలో స్టీల్ పైపు ఇంటి పక్కనే ఉన్న 11 కేవీ వైర్లకు తగలడంతో రమణ విద్యుత్‌షాక్‌కు గురై తీవ్ర గాయాలయ్యాయి. విద్యుత్‌లైన్ ట్రిప్ కావడంతో సరఫరా నిలిచిపోయింది. ప్రమాదాన్ని గమనించిన సమీప వ్యక్తులు వెంటనే ఆమెను తొలుత నకిరేకల్ అక్కడినుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం రమణ ఆరోగ్యం కొంత నిలకడగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కూల్‌డ్రింక్ షాపులో చోరీ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని బైపాస్ రోడ్డులో గల కూల్‌డ్రింక్ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. బాధితుడు నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతిరోజు మాదిరిగా షాప్ బంద్ చేసి వెళ్లిపోయిన తర్వాత దుకాణం వెనుక ఉన్న చిన్నడోర్ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి లోపలకు ప్రవేశించారు. కూల్‌డ్రింక్ బాటిల్స్, సిగరెట్ ప్యాకెట్స్, కౌంటర్లో ఉన్న నగదు అపహరించారు. సుమారు రూ.5 వేల వరకు ఉండవచ్చని బాధితుడు పేర్కొన్నాడు. ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఒక సెల్‌ఫోన్ దొరికినట్లు తెలిసింది.

విజయవంతం చేయాలి

కట్టంగూర్ : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న నిరుద్యోగ నిరసన గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని టీపీసీసీ నకిరేకల్ నియోజకవర్గ పరిశీలకుడు మర్రి నిరంజన్‌రెడ్డి కోరారు. బహిరంగ సభ ప్రచార పోస్టర్‌ను టీపీసీసీ మాజీ కార్యదర్శి దైద రవీందర్‌తో కలిసి కట్టంగూర్‌లో ఆదివారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, పీఏసీఎస్ చైర్మన్ బోళ్ళ వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పెరుమాళ్ళ శేఖర్, మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి వెంకటమ్మసాగర్, కౌన్సిలర్ గాజుల సుకన్య, జిల్లా కార్యదర్శి మాద లింగస్వామి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చెరుకు యాదగిరి, రెడ్డిపల్లి వీరస్వామి, ఎరుకల లక్ష్మీనారాయణ, గోపి పాల్గొన్నారు.

ఘనంగా చక్రతీర్థం, వసంతసేవ

- మట్టపల్లిలో కొనసాగుతున్న ఉత్సవాలు



మట్టపల్లిలో వసంతసేవ నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం బ్రహ్మశ్రీ బొర్రా వాసుదేవాచార్యులు పర్యవేక్షణలో శ్రీస్వామివారికి శాస్త్రోక్తంగా వసంతసేవ, చక్రతీర్థము, హోమపూర్ణాహుతి గావించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీస్వామివారికి సుప్రభాతసేవ, ద్రవిడప్రబంధసేవాకాలం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మి అమ్మవారికి సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి దోపోత్సవం(తిరుమంగయాళ్వారాదుల చరిత్ర పఠనం) ధ్వజావరోహణము, మౌనబలి, చేపట్టారు. కాగా స్వామిఅమ్మవార్లను అశ్వవాహనంపై శ్రీజయమన్నార్ అలంకారంలో ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో చివరిరోజైన సోమవారం శ్రీరంగనాయకస్వామి అలంకారంలో శృంగారడోలోత్సవం(పవళింపుసేవ), భక్తి సంగీతవిభా వరి, ఆశీర్వచనము, తీర్థప్రసాదాల వినియోగం ఉంటాయని అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్ తెలిపారు. వేడుకల్లో పాలకమండలి సభ్యులు, వెంకటనారాయణ, రామయ్య, కామేశ్వరమ్మ, ఫణికుమార్, అర్చకులు రామాచార్యులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, హరికిరణాచార్యులు, వంశీక్రిష్ణమాచార్యులు, బజ్జూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

చెన్నై టు కశ్మీర్‌కు సైకిల్ యాత్ర..

- తమిళనాడుకు చెందిన యువకుడి సాహసం
- పర్యావరణ పరిక్షణపై అవగాహన కల్పించేందుకేనని వెల్లడి



సైకిల్ యాత్ర చేస్తున్న బిషాల్

మాడుగులపల్లి: చెన్నై టు కశ్మీర్ దాదాపు 3000 కిలోమీటర్లు. బస్సు, రైల్లో వెళ్లాలంటే రోజుల తరబడి సమయం పడుతుంది. అలాంటిది ఒంటరిగా ఓ యువకుడు సైకిల్ యాత్ర చేపట్టాడు. యువతకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నాడు. అతడే తమిళనాడు రాష్ట్రానికి చెందిన బిషాల్. మే 1న యాత్ర ప్రారంభించి వారంరోజుల్లో మాడుగులపల్లి వరకు చేరుకున్నాడు. వివరాలు అతడి మాటల్లోనే.. నా పేరు బిషాల్. ఇంటర్ వరకు చదివా. పేదరికం వల్ల చదువు మధ్యలో వదిలేశా. మాకు కోయంపేట్ నగరంలో చిన్న టీ కొట్టు ఉండడంతో నాన్నకు పనిలో సాయం చేసేవాడిని. చిన్ననాటి నుంచి ప్రకృతి, పర్యావరణ అంశాలంటే ఆసక్తి. ఆధునిక ప్రపంచంలో యువతకు వీటిపై స్పృహ కరువైంది. అందుకే అవగాహన పెంచేందుకు తల్లిదండ్రులను ఒప్పించి సైకిల్ యాత్ర చేపట్టా. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రోజూ 12 గంటలు సైకిల్ తొక్కుతూ 100 నుంచి 120 కిలోమీటర్లు ప్రయాణిస్తా. గతంలో ఆర్మీ ఎంపికలో పాల్గొని ఛాతీ సరిపోక త్రుటిలో అవకాశాన్ని కోల్పోయా. రోజుకూ 100 కిలోమీటర్లు ప్రయాణించినా అలసట అనిపించదు. రాత్రి రహదారుల వెంట పెట్రోల్ బంకులు, బస్టాండుల్లో పడుకుంటా. పెద్ద మొత్తంలో డబ్బు లేకున్నా ఉన్న కొద్దిపాటితో సద్దుకుంటున్న. తెలంగాణలోకి ప్రవేశించాక చాలా మంది సాయం అందించారు. ఇక్కడి మనుషులకు సాయం చేసే గుణం ఉంది. మరో 25 రోజుల్లో కశ్మీర్ చేరుకొని అక్కడ సరిహద్దు ప్రదేశాలను కూడా వీక్షించాలన్నది నా కోరిక' అంటూ తన యాత్ర విశేషాలను వెల్లడించాడు.

క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



క్రీడాకారులతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రగౌడ్ తదితరులు

హుజూర్‌నగర్: క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రామచంద్ర గౌడ్, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు దేవరం రవీందర్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లోని ఎస్‌ఎస్‌పీ క్యాంప్‌లో నిర్వహిస్తున్న వేసవి కబడ్డీ శిబిరాన్ని ఆదివారం వారు సందర్శించి మాట్లాడారు. క్రీడల్లో నైపుణ్యాలను మెరుగు పరుచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో కబడ్డీ అభివృద్ధికి అనేక శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత ఆయా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కబడ్డీ శిక్షకులు సునీల్ కుమార్, పీఈటీలు రవి, మైసయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

భానుపురి : పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఐదు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం మధ్యాహ్నం చక్రస్నానం, రాత్రి శ్రీ పుష్పయాగంతో ముగిసాయని ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు తెలిపారు. ఆదివారం ఉదయం యాగశాలలో ద్వార తోరణ, ధ్వజ కుంభ ఆరాధనలు పూర్తి చేసి మూల మంత్ర హోమాలు, మహా పూర్ణాహుతి నిర్వహించారు. తదనంతరం వసంతోత్సవం చేపట్టి ఆలయంలోని ఈశాన్య భాగంలో ఉన్న కోనేరులో చక్ర స్నానం నిర్వహించారు. రాత్రి జరిగిన శ్రీపుష్పయాగంలో ప్రత్యేకంగా తెప్పించిన 12 రకాల పూలతో మండలం రచించి శ్రీపుష్పయాగం చేశారు. వేంకటేశ్వర స్వామి వారికి పుష్పాభిషేకం చేశారు. 12 రకాల ప్రసాదాలు నివేదన చేసి భక్తులకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో యజ్ఞాచార్యులు హరిచరణ్ ఆచార్యులు, భరత్ కుమార్ ఆచార్యులు, శ్రీహరి ఆచార్యులు, సంకర్షణ ఆచార్యులు, ఫణి కుమార్ ఆచార్యులు, కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, కృష్ణయ్య, రవీందర్, మాధవరావు, మంజుల, జ్ఞాన కుమారి, మాధవి, లక్ష్మి వెంకటేశ్వరరావు, శ్రీశైలం, రజిత, ఆండాళ్ గోష్టి భక్త బృందం, వికాస తరంగిణి భక్త బృందం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

యాదగిరిగుట్ట రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని వంగపల్లి గ్రామ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం జమ్మాపురం గ్రామానికి చెందిన చిన్నబత్తిని రాజేష్ (31) ఆలేరులోని తమ బంధువుల ఇంటికి శనివారం వెళ్లాడు. పని ముగించుకుని రాత్రి పదకొండు గంటల సమయంలో తిరిగి జమ్మాపురం గ్రామానికి, తన నానమ్మ దుస్తైనమ్మతో కలిసి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో యాదగిరిగుట్ట మండలం వంగపల్లి పరిధిలోనికి రాగానే వెనకనుంచి కారు ఢీ కొట్టింది. దీంతో రాజేష్ తలకు తీవ్ర గాయం కావడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. దుస్తైనమ్మకు, స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, పాప ఉన్నారు. మృతుడి తండ్రి బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి తెలియజేశారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో

నార్కట్‌పల్లి : వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అమ్మనబోలు గ్రామంలో ఆదివారం రైతులు రాస్తారోకో చేశారు. అమ్మనబోలు గ్రామంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రెండు వేల బస్తాలు నింపారని, లారీలు రాకపోవడంతో రాత్రి కురిసిన అకాల వర్షానికి బస్తాలన్నీ తడిసి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తేమశాతం వచ్చినప్పటికీ పది రోజుల నుంచి లారీలు రాకపోవడం, కాంటాలు పెట్టకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంటాలు వేసిన ధాన్యాన్ని సైతం తీసుకుపోవడం లేదని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అధికారులతో మాట్లాడి నచ్చజెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొంపెల్లి సైదులు, బద్దం రాంరెడ్డి, ఉప సర్పంచ్ జాన్‌రెడ్డి, కావటి పరశురాములు, ఎల్లేష్ పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు

బూత్ స్థాయిలో పార్టీని పటిష్ట పర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్

నల్లగొండ టూటౌన్ : బూత్ స్థాయిలో బీజేపీని ప్రతిష్ట పరిచి పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ అన్నారు. ఆదివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ ప్రవాస్ యోజన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ బీజేపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ తొమ్మిదేళ్లలో ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలను గడపగడపకు తీసుకువెళ్లి ప్రజలకు వివరించాలని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా ఇన్‌చార్జి ప్రదీప్‌కుమార్, సినీనటి కవిత, నూకల నరసింహారెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పాలకూరి రవి తదితరులు పాల్గొన్నారు.

'మునుగోడు'లో శరవేగంగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్ : ఉప ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారంగా మునుగోడు నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు శర వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల పనులు జరగవని, అవి శిలాఫలాకాలకే పరిమితం అవుతాయని మాట్లాడిన వ్యక్తుల కళ్లు అభివృద్ధిని చూసి మూతలు పడుతున్నాయని ఎద్దేవా చేశారు. చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ఎన్నికల్లో ఓడిన వ్యక్తి పదవిలో ఉన్నప్పుడు చేసిందేమీలేదని విమర్శించారు. ఇప్పుడు తాము అభివృద్ధి చేసి చూపుతుంటే మాత్రం సొల్లు మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో పనులు ప్రారంభించినవి, జీవో విడుదలైన నిధులు 288కోట్లుకాగా, మరో 226 కోట్ల నిధులకు సంబంధించి జీఓ విడుదల కావాల్సి ఉందని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి కేటీఆర్ ప్రకటించిన దత్తత హామీ మేరకు అన్ని రకాల సమస్యలకు పరిష్కారం జరుగుతుందన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీకి ఇచ్చిన 50కోట్ల హామీలో రూ.25కోట్లు విడుదల చేస్తూ ఈ నెల 5న ప్రభుత్వం జీఓ ఇచ్చిందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్, సింగిల్‌విండో చైర్మన్‌లు వెన్‌రెడ్డి రాజు, చింతల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ ఎండీ.బాబాషరీఫ్, నాయకులు గుండెబోయిన వెంకటేష్, కానుగు బాలరాజు, తొర్పునూరి మల్లేష్‌గౌడ్, తాడూరు పరమేష్, తొర్పునూరి నర్సింహ్మ, శవగోని వెంకటేశ్, కాకి సుందర్, రామచంద్రం పాల్గొన్నారు.

అర్హులందరికీ దళిత బంధు ఇవ్వాలి



మాట్లాడుతున్న పాలడుగు నాగార్జున

రామగిరి(నల్లగొండ): నియోజకవర్గంలో అర్హులైన 1500 మందికి దళితబంధు అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిప్పర్తి మండలంలోని నర్రా రాఘవరెడ్డి భవనంలో ఆదివారం జరిగిన కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళిత పేదలకు పీఓటీ భూములు పట్టాలు చేయాలన్నారు. దేవరకొండ, మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్లలో దళితులపై దాడులు అధికమయ్యాయని పోలీసులు అరికట్టాలన్నారు. కొండేటి శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెమిడాల పర్వ రాములు, జిట్టా నగేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దైద శ్రీను, బొట్టు శివకుమార్, పెరిక విజయకుమార్, కోడిరెక్క మల్లన్న, రవీందర్, దంతాల నాగార్జున, మల్లయ్య, పాపరావు పాల్గొన్నారు.

నేడు నల్లగొండలో గ్రీవెన్స్‌డే రద్దు

నల్లగొండ : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమం ఈ సోమవారం నిర్వహించడం లేదని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాల కారణంగా జిల్లా యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించిందని, అందువల్ల 8వ తేదీన నిర్వహించాల్సిన గ్రీవెన్స్ డేను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

వర్షం.. తడిసిన ధాన్యం



పెద్దవూరలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు





పెద్దవూరలో ధాన్యం చుట్టూ నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతులు



పెద్దవూరలో ధాన్యం చుట్టూ చేరిన వర్షం నీరు

భూసార నమూనాలు సేకరించే సమయమిదే..

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు

నడిగూడెం : ప్రస్తుతం రబీ సీజన్ కూడా పూర్తయింది. వరి, ఇతర క్షేత్ర పంటలు కూడా ఏమీ లేవు. ఈ సమయంలోనే మట్టి నమూనాలు తీసి, వాటిని పరీక్ష చేయించాలి. ఆ భూసార ఫలితాల ఆధారంగా ఎరువులను ఉపయోగించాలని సూచిస్తున్నారు.. నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు.

భూసార పరీక్ష అంటే....

పొలం నుంచి సేకరించిన మట్టిని వివిధ భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి, దాని ద్వారా ఎంత మోతాదులో ఎరువులను వాడాలో తెలుసుకోవడమే ఈ భూసార పరీక్షకు అర్థం.

మట్టి నమూనాలు తీసే సమయం

- పంట కోత తర్వాత తీయవచ్చు.
- వేసవిలో పంటలు లేని సమయంలో తీయవచ్చు.

మట్టి నమూనాలు తీయకూడని ప్రదేశాలు – సమయాలు

- ఎరువులు వేసిన తర్వాత నెల రోజుల వరకు నమూనా తీయరాదు.
- నీరు పెట్టిన తరువాత తీయరాదు.



మట్టి నమూనాలు తీస్తున్న రైతులు



- నీడపడే ప్రదేశాలు, నీటి ముంపు ప్రాంతాలు, పెంటకుప్పలు దగ్గర, గట్లు, చెట్లు, రోడ్ల దగ్గర తీయరాదు.

మట్టి నమూనాలు తీయాల్సిన విస్తీర్ణం

ఒక రకం పొలానికి ఒక నమూనా తీయాలి. పొలం మరీ పెద్దయితే ప్రతి ఐదు ఎకరాల్లో నమూనా తీయాలి. నేల నిర్మాణం, రంగు, మురుగు, పారుదల సౌకర్యం, నేల వాలు, చౌడు, క్షార, గుణాలు, పంటలసరళి, మొదలగు విషయాల్లో ఏవేని, తేడా కన్పిస్తే అన్ని నమూనాలు ఆ పొలం నుంచి తీయాల్సి ఉంటుంది.

నమూనాలు సేకరించాల్సిన లోతు

- పైరు పంటలకు 6 అంగుళాలు
- పండ్ల తోటల్లో 5నుంచి 6అడుగుల వరకు. ప్రతి అడుగుకు ఒక నమూనా
- చౌడు, ఆమ్ల నేలలకు-అడుగు లోతులో ప్రతి 6అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

నమూనాలు ఎలా సేకరించాలి

- నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొదలగు వాటిని తీసి వేయాలి.
- గడ్డపారను, పారను గానీ నమూనాను తీయడానికి ఉపయోగించాలి.
- గొయ్యి అంచుల నుంచి పారతో, తాపీతో గానీ మట్టిని సేకరించాలి.
- పొలంలో 8నుంచి 10 స్థలాల నుంచి ఈ పద్ధతిలో మట్టిని సేకరించాలి.
- సేకరించిన మట్టినంతటిని కలిపి నేలపై పరచి దానిని నాలుగు భాగాలు చేయాలి. మూలలకు ఎదురెదురుగా ఉన్న భాగాల మట్టిని తీసుకొని మిగిలిన మట్టిని పారవేయాలి. ఈ విధంగా 500 గ్రాముల నమూనాలను సేకరించాలి.
- ఈ అరకేజీ మట్టిని గుడ్డ సంచిలో, పాలిథిన్ సంచిలో గానీ వేసి, రైతు పేరు, చిరునామా, సర్వే నంబరు, పొలం విస్తీర్ణం, మెట్ట, పల్లం, ఆరుతడి పంటలు, గత 3 సంవత్సరాలుగా వాడుతున్న ఎరువులు, రాబోవు సీజన్‌లో వేయాల్సిన పంటలు, సేకరించిన తేదీ మొదలగు వివరాలను జతచేయాలి. సమాచార పత్రంతో కూడిన మట్టి నమూనాలను సంబంధిత వ్యవసాయ అధికారులకు లేదా భూసార పరీక్ష కేంద్రానికి పంపాలి.

భూసార పరీక్షల వల్ల ఉపయోగాలు

- పొలంలో పోషకాల స్థాయి తెలుస్తుంది.
- ఆ పొలంలో ఏయే పంటలు పండించవచ్చో తెలుస్తుంది.
- ఎరువులు ఎంత మోతాదులో, ఎప్పుడు వేయాలో తెలుస్తుంది.
- నేలల సమస్యలు తెలుస్తాయి. దాని ప్రకారం ఎరువులను ఉపయోగించవచ్చు.
- ఎరువుల అనవసరపు ఖర్చు తగ్గించవచ్చు. సరైన సమయంలో భూసార పరీక్షలు చేయిస్తే సేంద్రియ ఎరువులను కూడా ఉపయోగించి నాణ్యమైన పంటలను పండించవచ్చు.